సాక్షి చిత్తూరు

బుధవారం । 15 । మార్చి । 2023



చిత్తూరు బులియన్

బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.53,000
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,200

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.65,000
రిటైల్ వెండి గ్రాము	రూ.67

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	36	23
తిరుపతి	37	23
తిరుమల	32	18
గూడూరు	33	26
నగరి	37	23



ఆదర్శనీయం

వరదయ్యపాళెం: శ్రీసిటీ అభివృద్ధి ఆదర్శనీయమని తమిళనాడు రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి పి.రామ్మోహనరావు అన్నారు. ఆయన శ్రీసిటీని సందర్శించగా ఎండీ రవీంద్ర సన్నారెడ్డి స్వాగతం పలికారు.

న్యూస్‌రీల్

రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్‌కు ఇద్దరు విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

వెదురుకుప్పం : రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ సైన్స్ ఎగ్జిబిషన్‌కు వెదురుకుప్పం జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు వెంకటరమణారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 9వ తరగతి విద్యార్థులు టి.డింపుల్, తరుణ్‌చక్రవర్తి జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభను కనబరచినట్లు వెల్లడించారు. తమ పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ప్రదర్శనలకు ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులతోపాటు గైడ్ టీచర్లు గోను శ్యామల, జ్యోత్స్నను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బండి ప్రభాకర్‌రెడ్డి, మురళీరెడ్డి, కమలనాభన్, ఉమామహేశ్వర్, భ్రమరాంబ, భద్రావతి పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో 'పది' హాల్ టికెట్లు

చిత్తూరు కలెక్టరేట్ : పదో తరగతి పరీక్షలకు సంబంధించి విద్యార్థుల హాల్‌టికెట్లు, నామినల్ రోల్స్‌ను వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈఓ విజయేంద్రరావు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఆయా పాఠశాలల లాగిన్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకునే సౌకర్యం కల్పించామన్నారు. పాఠశాలల నిర్వాహకులు, ప్రధానోపాధ్యాయులు హాల్‌టికెట్లను పరిశీలించి, ఫొటోలో తప్పులు లేవని ధ్రువీకరించిన తర్వాతే విద్యార్థులకు అందజేయాలని స్పష్టం చేశారు. ఒకవేళ మార్పులు ఉంటే అటెస్ట్ చేసిన తర్వాతే హాల్‌టికెట్ ఇవ్వాలని సూచించారు. ఫొటో మార్పు దరఖాస్తు bse.ap.gov.in (బీఎస్‌ఈ.ఏపీ.జీఓవి. ఇన్) వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉందని వెల్లడించారు. స్ట్రీమ్, జిల్లా, పాఠశాల , విద్యార్థి పేరు, పుట్టిన తేదీలను నమోదు చేస్తే ఇతరులు కూడా బోర్డు వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని వివరించారు.

పది పరీక్షల అబ్జర్వర్‌గా మువ్వా రామలింగం



చిత్తూరు కలెక్టరేట్ : పదో తరగతి పరీక్షల అబ్జర్వర్‌గా జాయింట్ డైరెక్టర్ మువ్వారామలింగం నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించే పదో తరగతి పరీక్షలను రామలింగం పర్యవేక్షించనున్నట్లు పేర్కొన్నారు.

అప్రమత్తతతో శాంతిభద్రతల రక్షణ



మాట్లాడుతున్న డీఐజీ రవిప్రకాష్, చిత్రంలో ఎస్పీ రిషాంత్‌రెడ్డి

చిత్తూరు అర్బన్: నేరం జరగముందే పోలీసులు అప్రమత్తంగా ఉండడం ద్వారా శాంతిభద్రతలను రక్షించవచ్చని అనంతపురం రేంజ్ డీఐజీ రవిప్రకాష్ తెలిపారు. మంగళవారం చిత్తూరులోని జిల్లా పోలీసు కార్యాలయం, ఆర్మ్డు రిజర్వు విభాగాల్లో వార్షిక తనిఖీ నిర్వహించారు. ఎస్పీ రిషాంత్‌రెడ్డితో కలిసి స్పెషల్ బ్రాంచి, డీసీఆర్బీ, ఫింగర్ ప్రింట్స్, క్లూస్ టీం, ఏఆర్, ఎంటీ తదితర విభాగాలకు చెందిన రికార్డులనుపరిశీలించారు. స్పెషల్ బ్రాంచి పటిష్టమైన సమాచార వ్యవస్థతో నిత్యం అప్రమత్తంగా ఉండాలని, భూకబ్జాదారులు, అరాచక శక్తుల, కిరాయి హంతకుల ముఠాల కదలికలపై నిఘా పెట్టాలని ఆదేశించారు. రాజకీయ ప్రతీకారాలు, నిత్యం వివాదాలు సృష్టించేవాళ్లు, అసాంఘిక శక్తులు, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవాళ్లు, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల గురించి ఎప్పటికప్పుడు సమాచారం సేకరించాలని సూచించారు. సాధారణ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాలపై ఇప్పటి నుంచే దృష్టి పెట్టాలన్నారు. జాతీయ, రాష్ట్ర మానవహక్కుల కమిషన్ నుంచి వచ్చే నోటీసుల పట్ల నిర్లక్ష్యంగా ఉండొద్దని హెచ్చరించారు. సైబర్ నేరాల్లో పురోగతి సాధించాలని, ప్రజలకు సైతం అవగాహన కల్పించాలని కోరారు. సచివాలయాల్లోని మహిళా పోలీసులను సమన్వయం చేసుకుని నేరాలను నిరోధించడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఏఎస్పీ జగదీష్ పాల్గొన్నారు.

అన్నదాతకు అభయం

రైతు సంక్షేమమే పరమావధిగా ప్రభుత్వం విప్లవాత్మకమైన పథకాలను ప్రవేశపెట్టింది. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తోంది. సాగును సంబరంగా తీర్చిదిద్దేందుకు పూర్తి సహకారం అందిస్తోంది. అప్పుల ఊబిలో చిక్కుకోకుండా పెట్టుబడి సాయం పంపిణీ చేస్తోంది. విత్తనాల సరఫరా నుంచి పంట కొనుగోలు వరకు అండగా నిలుస్తోంది. ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతే పక్కాగా పరిహారం చెల్లిస్తోంది. చివరకు అన్నదాత అనుకోని కారణాలతో అసువులు బాసితే వారి కుటుంబం వీధిన పడకుండా ఆదుకుంటోంది. ఇంటి పెద్దను పోగొట్టుకుని చితికిన బతుకుల్లో చిరుదివ్వెలు వెలిగిస్తోంది. బాధితుల భవిష్యత్‌కు భరోసా కల్పిస్తూ రూ.7లక్షల చొప్పున ఆర్థిక సాయం అందజేస్తోంది. చివరకు గత టీడీపీ హయాంలో బలవన్మరణానికి పాల్పడిన రైతన్నలకు ప్రాణాలకు గౌరవమిస్తూ ఆయా కుటుంబాలకు చేయూతనందించింది.





- రైతు సంక్షేమమే లక్ష్యంగా పథకాలు
- ఆత్మహత్యకు పాల్పడిన అన్నదాతల కుటుంబాలకు బాసట
- రూ.7లక్షల చొప్పున ఆర్థికసాయం
- గత టీడీపీ హయాంలో అసువులు బాసిన రైతన్నల కుటుంబీకులకు చేయూత
- రూ.5లక్షల చొప్పున జమ చేసిన ప్రభుత్వం

సాక్షి, చిత్తూరు : వ్యవసాయరంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతులకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. అన్నదాతలకు అండదండలందిస్తూ పలు పథకాలను అమలు చేస్తున్నారు. ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అన్నివిధాలుగా సహకారం అందిస్తున్నారు. అప్పుల భారంతో, అధిక వడ్డీలు కట్టలేక, నష్టాల ఊబిలో చిక్కుకుని ఆత్మహత్యలకు పాల్పడిన రైతుల కుటుంబాలను ఆదుకునేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టారు. కుటుంబ పెద్దను పోగొట్టుకున్న కుంగిపోయిన జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఆర్థికసాయం అందిస్తున్నారు. ఒక్కో కుటుంబానికి రూ.7లక్షల చొప్పున పంపిణీ చేస్తున్నారు. చివరకు గత టీడీపీ ప్రభుత్వంలో ఆత్మహత్య చేసుకున్నవారి కుటుంబీకులకు సైతం రూ.5లక్షల వంతున చెల్లించారు.

ఇచ్చిన మాట మేరకు..

అప్పులు, అధిక వడ్డీలు, ఆర్థిక ఇబ్బందులతో అసువులు బాసిన రైతుల కుటుంబాలను ఆదుకుంటామని నాడు ప్రతిపక్ష నేతగా ప్రజా సంకల్పయాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. అందులోనూ 2014 నుంచి వివిధ కారణాల ద్వారా ఆత్మహత్యలు చేసుకున్న రైతుల కుటుంబాలను అప్పటి టీడీపీ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోలేదు. అప్పుడు లబ్ధి పొందని వారికి కూడా సహాయం చేస్తామని పాదయాత్రలో ఇచ్చిన హామీని ఆయన చెల్లించుకున్నారు. 2014–19 మధ్య కాలంలో ఆర్థిక సాయం అందుకోలేని 9 మంది రైతుల కుటుంబాలను గుర్తించారు. ఒక్కొక్క కుటుంబానికి రూ.5లక్షల చొప్పున మొత్తం రూ.45 లక్షలు అందించారు. అందులో కుప్పం నియోజకవర్గం-3, జీడీ నెల్లూరు -2, పుంగనూరు- 2, నగరి-1 , పూతలపట్టుకు చెందిన ఒక రైతు కుటుంబం ఉంది.

రూ.7లక్షలకు పరిహారం పెంపు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2019 జూన్ నుంచి రైతు కుటుంబాలకు చెల్లించే పరిహారాన్ని రూ.7లక్షలకు పెంచింది. ఇప్పటి వరకు మొత్తం 27మందికి సహాయం అందించారు. అందులో పుంగనూరు నియోజకవర్గ పరిధిలో 9 మంది, పలమనేరు- 8, నగరి-7 , జీడీనెల్లూరు ముగ్గురికి రూ.7లక్షల చొప్పున పంపిణీ చేశారు.

సాయం పొందాలంటే ఇలా..

కుటుంబ పెద్ద కోల్పోయి ఆర్థికంగా చితికిపోయిన రైతు కుటుంబాలవారు ప్రభుత్వం నుంచి సాయం పొందవచ్చు. అయితే రైతు ఆర్థిక సమస్యలతో ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని పోలీసులు, రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు నిర్ధారించాలి. అనంతరం ఏ మాత్రం జాప్యం లేకుండా బాధిత కుటుంబాలకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేస్తుంది.

కొండంత అండగా 'సంక్షేమం'

- అన్ని గ్రామ పంచాయతీల్లో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా రైతులకు అవసరమైన ఎరువుల, విత్తనాలు, పథకాలు అందజేస్తున్నారు. సాగుకు కావాల్సిన సలహాలు అందిస్తున్నారు. గిట్టుబాటు ధరతో పంటలు కొనుగోలు చేస్తున్నారు.
- రైతు భరోసా కింద ఏడాదికి రూ.13,500 (పీఎం కిసాన్‌తో కలిపి) ఆర్థిక సాయం అందిస్తున్నారు
- రూ.లక్ష వరకు సున్నావడ్డీ పంట రుణాలు మంజూరు చేస్తున్నారు.
- ఈ- క్రాప్ ద్వారా పంటలకు ఉచిత బీమా సౌకర్యం కల్పిస్తున్నారు.
- వైయస్సార్ యాంత్రీకరణ పథకం ద్వారా వ్యవసాయ పనిముట్లు, ట్రాక్టర్లను రాయితీపై అందజేస్తున్నారు.
- వైఎస్సార్ జలకళ పథకం కింద ఉచితంగా బోర్లు వేయించి, మోటార్లు పంపిణీ చేస్తున్నారు.
- వైఎస్సార్ అగ్రి లాబ్‌లు ఏర్పాటు చేసి భూసార పరీక్షలు చేయిస్తున్నారు.ఎరువులు, విత్తనాల నాణ్యత ప్రమాణాలపై సలహా సూచనలు ఇస్తున్నారు.
- గ్రామాల్లో పశువులకు ఉచిత వైద్య సదుపాయం కల్పించారు.

సాయాన్ని మరువలేం



మా తండ్రి వేణుగోపాల్ అప్పులు చేసి బోర్లు వేయించారు. అయినప్పటికీ నీరు సక్రమంగా పడలేదు. ఆ పరిస్థితుల్లో 2015 మే నెల 8వ తేదీన ఆత్మహత్య చేసుకున్నారు. అప్పట్లో అధికారులు వచ్చి వెళ్ళారే తప్ప ఎటువంటి సహకారం అందించలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టగానే అధికారులు మళ్లీ రావడంతో ఆశలు చిగురించాయి. 2019 డిసెంబర్‌లోనే రూ.5 లక్షలు నా ఖాతాలోకి జమ చేశారు. ఆ సొమ్ముతో ఉన్న అప్పులను తీర్చుకున్నాం. సీఎం జగనన్న చేసిన సాయాన్ని మరువలేం.

– ధనశేఖర్, ఎస్.కొత్తపల్లె, కుప్పం మండలం

జగనన్నకు రుణపడి ఉంటాం



మా తండ్రి దొర స్వామి అప్పులు చేసి బోర్లు వేయించారు. అప్పులకు వడ్డీలు చెల్లించలేక 2015 ఏప్రిల్ 13వ తేదీన ఆత్మహత్యకు పాల్పడ్డారు. అప్పట్లో ఎవరూ మమ్మల్ని పట్టించుకోలేదు. వివిధ శాఖల వారు వచ్చారు. వివరాలు రాసుకోవడమే తప్ప ప్రయోజనం శూన్యం. 2019లో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత మరోసారి అధికారులు మా ఇంటికి వచ్చి వివరాలు తీసుకెళ్లారు. కొద్దిరోజుల్లోనే నా బ్యాంకు ఖాతాకు రూ.5లక్షలు జమ చేశారు. మా కుటుంబాన్ని ఆదుకున్న జగనన్నకు జీవితకాలం రుణపడి ఉంటాం.

– ఇరసయ్య , చెర్లోపల్లె, జీడీ నెల్లూరు మండలం

జాప్యం లేకుండా సాయం



కొందరు రైతులు వివిధ కారణాలతో నిరాశ, నిస్పృహలకు లోనై ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. దీనిపై ఎప్పటికప్పుడు విచారణ చేపడుతున్నాం. ప్రభుత్వం తరఫున జాప్యం లేకుండా ఆర్థిక సాయం అందిస్తున్నాం. వ్యవసాయ రంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారు. రైతులు దేనికీ ఇబ్బంది పడాల్సిన అవసరంలేదు. క్షణికావేశంలో ప్రాణాలు కోల్పోకూడదు. పంటల సాగును లాభసాటిగా మార్చేందుకు వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో కృషి చేస్తున్నారు.

– జి.మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయశాఖాధికారి

గంగరంగ సంబరం

- వైభవంగా సుగుటూరు గంగమ్మ జాతర
- పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి పెద్దిరెడ్డి దంపతులు
- నేటి రాత్రి ఊరేగింపు.. నిమజ్జనం

పుంగనూరు : పట్టణంలో సుగుటూరు గంగమ్మ జాతర తొలిరోజు మంగళవారం రాత్రి వైభవంగా ప్రారంభమైంది. ముందుగా ప్యాలెస్‌లో అమ్మవారికి జమీందారులు మల్లికార్జున రాయల్, సోమశేఖర్ చిక్కరాయల్ , కుటుంబ సభ్యులు తొలి పూజలు నిర్వహించారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సతీమణి స్వర్ణమ్మతో కలసి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం జమీందారులను మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే వర్తక వ్యాపారుల సంఘ అధ్యక్షుడు వెంకటాచలపతి శెట్టి ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. రాత్రి పట్టణంలో అమ్మవారికి ఊరేగింపు నిర్వహించి, బుధవారం వేకువజామున ప్యాలెస్ ఆవరణలోని ఆలయంలో కొలువుదీరుస్తారు. అదే రోజు రాత్రి ఊరేగించి నిమజ్జనం చేస్తారు. పూజా కార్యక్రమాలలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, కమిషనర్ నరసింహ ప్రసాద్‌రెడ్డి, జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం, పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి, రెడ్డెప్ప, డీసీసీబీ చైర్‌పర్సన్ రెడ్డెమ్మ పాల్గొన్నారు.



గంగమ్మకు ప్రత్యేక పూజలు చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, స్వర్ణమ్మ దంపతులు



అన్నదానం చేస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

ఘనంగా ఊరేగింపు

సుగుటూరు గంగమ్మను అత్యంత సుందరంగా తీర్చిదిద్దిన పల్లకిలో కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

భారీ బందోబస్తు

జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటలు చోటు చేసుకోకుండా ఎస్పీ రిషాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు చేపట్టారు. డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, సీఐలు మధుసూదన్‌రెడ్డి, గంగిరెడ్డి, అశోక్‌కుమార్ పర్యవేక్షణలో సుమారు 300 మంది పోలీసులతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.

నగలు భద్రం



బంగారు ఆభరణాల లెక్కలు చూస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి బంగారు ఆభరణాలను మంగళవారం ఆలయ అధికారులు లాకర్‌కు తరలించి భద్రపరిచారు. గత నెల 13న మహాశివరాత్రిని పురస్కరించుకుని లాకర్ నుంచి తీసుకువచ్చి స్వామి, అమ్మవార్లకు అలంకరించారు. బ్రహ్మోత్సవాలు ముగియడంతో నగలను లాకర్‌లో భద్రపరిచారు.

భద్రతలో బ్యాలెట్

- పకడ్బందీగా బ్యాలెట్ బాక్సుల స్క్రూటినీ
- పక్కాగా స్ట్రాంగ్ రూమ్‌లకు సీల్



కౌంటింగ్ కేంద్రంలో బ్యాలెట్ బాక్సులు



స్ట్రాంగ్ రూమ్‌కు సీల్ వేస్తున్న రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ హరినారాయణన్

సాక్షి, తిరుపతి/చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లా పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బ్యాలెట్ బాక్సుల స్క్రూటినీ ప్రక్రియ నిర్వహించారు. మంగళవారం చిత్తూరులోని ఎస్‌వీ సెట్(ఆర్‌వీఎస్) కళాశాలలో ఏర్పాటు చేసిన కౌంటింగ్ కేంద్రానికి బ్యాలెట్ బాక్సులను పకడ్బందీ బందోబస్తు నడుమ తరలించారు. స్క్రూటినీ అనంతరం పట్టభద్రుల స్థానానికి 70.66 శాతం, ఉపాధ్యాయుల స్థానానికి 89.34 శాతం ఓట్లు (తిరుపతి జిల్లాలో రద్దయిన 229,233 పోలింగ్ కేంద్రాల ఓట్లు మినహాయించి) పోలైనట్లు రిటర్నింగ్‌అధికారి, కలెక్టర్ హరి నారాయణన్ అధికారికంగా ప్రకటించారు. అభ్యర్థులు, ఏజెంట్లు, అబ్జర్వర్లు కాటమనేని భాస్కర్, కోన శశిధర్ సమక్షంలో బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరచి సీల్ వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జేసీ వెంకటేశ్వర్, ట్రైనీ కలెక్టర్ వై.మేఘస్వరూప్, డీఆర్‌ఓ రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, డ్వామా పీడీ గంగా భవానీ, డీపీఓ లక్ష్మి, ఆర్డీఓలు సుజన, శివయ్య, రేణుక, మురళి, కలెక్టరేట్ ఏఓ కులశేఖర్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు శ్రీలేఖ, కిరణ్మయి పాల్గొన్నారు.

పురుషులే అధికం

పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మహిళల కంటే పురుషులే అధికంగా ఓటు హక్కు వినియోగించుకున్నారు. పట్టభద్రులకు సంబంధించి పురుషుల్లో మొత్తం 2,45,093 మందికి గాను 1,76,871 మంది ఓటు వేశారు. మహిళల్లో 1,34,686 మందికి గాను 91,514 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అలాగే ఉపాధ్యాయులకు సంబంధించి 16,825 మంది పురుషులకు గాను 15,107 మంది, 10,869 మంది మహిళలకు గాను 9,634 మంది ఓటు హక్కు వినియోగించుకున్నట్లు అధికారులు వివరించారు.

పట్టభద్రుల పోలింగ్ వివరాలు

జిల్లా	మొత్తం ఓటర్లు	ఓటు వేసిన వారు	పోలింగ్ శాతం
అన్నమయ్య	23,838	16,850	70.69
బాపట్ల	26,390	19,655	74.48
చిత్తూరు	54,152	43,161	79.70
నెల్లూరు	1,07,635	68,559	83.38
ప్రకాశం	82,225	59,835	55.59
తిరుపతి	85,570	60,327	70.50
మొత్తం	3,79,810	2,68,387	70.66

ఉపాధ్యాయుల పోలింగ్ వివరాలు

జిల్లా	మొత్తం ఓటర్లు	ఓటు వేసిన వారు	పోలింగ్ శాతం
అన్నమయ్య	1,932	1,728	89.44
బాపట్ల	1,789	1,686	94.24
చిత్తూరు	3,887	3,448	88.71
నెల్లూరు	8,165	7,277	89.12
ప్రకాశం	5,789	5,322	91.93
తిరుపతి	6,132	5,280	86.11
మొత్తం	27,694	24,741	89.34

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- సర్వం సిద్ధం చేసిన అధికారులు
- ఎలక్ట్రానిక్ వస్తువులకు నో పర్మిషన్
- నిముషం ఆలస్యమైనా నో ఎంట్రీ
- ఫిర్యాదులకు : 8885419096, 8688595909, 18004257635 నంబర్లు


పాలసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్ష కేంద్ర

చిత్తూరు కలెక్టరేట్ : ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 4వ తేదీ వరకు కొనసాగనున్నాయి. ఈ మేరకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఇంటర్ ఫస్టియర్ జనరల్ విద్యార్థులు 17,366 మంది, సెకండియర్ విద్యార్థులు 14,210 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. జిల్లా వ్యాప్తంగా 50 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. అందులో పకడ్బందీగా మౌలిక వసతులు కల్పించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. విద్యార్థులను గంట ముందుగానే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించనున్నారు. నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రంలోకి అనుమతించమని అధికారులు స్పష్టం చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో మాస్‌కాపీయింగ్ జరగకుండా ఉండేందుకు కట్టుదిట్టంగా చర్యలు చేపట్టారు. ఆయా కళాశాలల సిబ్బందిని కాకుండా, ప్రభుత్వ ఉపాధ్యాయులను ఇన్విజిలేటర్లుగా నియమించారు.

నిఘా నీడలో..

ప్రతి పరీక్ష కేంద్రంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల నిఘాలోనే చీఫ్ సూపరింటెండెంట్ సమక్షంలో ప్రశ్న పత్రాలను బండిళ్లు ఓపెన్ చేసి విద్యార్థులకు పంపిణీ చేయనున్నారు. పరీక్షల నిర్వహణ తీరును ఆన్‌లైన్ స్ట్రీమింగ్ ద్వారా విజయవాడలోని రాష్ట్ర ఇంటర్మీడియట్ శాఖ అధికారులు అక్కడ నుంచి పర్యవేక్షించేలా ఏర్పాట్లు చేశారు.

144 సెక్షన్ అమలు

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని అధికారులు వెల్లడించారు. విద్యార్థుల సందేహాల నివృత్తి, ఫిర్యాదుల కోసం హెల్ప్‌లైన్ నంబర్లు 8885419096, 8688595909, 18004257635 ఏర్పాటు చేశారు.

సెల్‌ఫోన్‌కు నో పర్మిషన్

పరీక్ష కేంద్రాల్లోకి చీఫ్ సూపరింటెండెంట్లతో సహా ఏ ఒక్కరూ ఫోన్లు, ఇతర డిజిటల్ పరికరాలను తీసుకువెళ్లడానికి అనుమతి లేదు. ప్రశ్నపత్రాలను తీసుకొనే సమయంలో ఆయా విభాగాల అధికారులు, ఇతర సిబ్బంది వారి సెల్‌ఫోన్లను పోలీసు స్టేషన్లలో డిపాజిట్ చేయాలని ఆదేశించారు. అలాగే పరీక్షల విధుల్లో ఉండే టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది కూడా తమ సెల్‌ఫోన్లను చీఫ్ సూపరింటెండెంట్ల వద్ద డిపాజిట్ చేయాలి.

ఐడీ తప్పనిసరి

పరీక్ష కేంద్రాల్లోకి మీడియాకు అనుమతి లేదు. పరీక్షల విధుల్లో ఉండే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఐడీ కార్డులు ధరించాలి. కొన్ని కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు హాల్‌టికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బంది పెడుతున్న నేపథ్యంలో ఇంటర్ బోర్డు ప్రత్యేక చర్యలు చేపట్టింది. విద్యార్థులు నేరుగా హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించింది. ప్రతి జిల్లాలో విద్యార్థులు, పరీక్ష కేంద్రాల సంఖ్యకు తగ్గట్టు ఫ్లయింగ్ స్క్వాడ్లు, సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేశారు. విద్యార్థుల కోసం ఆర్టీసీ ప్రత్యేకంగా బస్సు సర్వీసులను నడుపుతోంది.

అన్ని ఏర్పాట్లు పూర్తి



జిల్లాలో ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా జరుపడానికి ఏర్పాట్లు పూర్తి చేశాం. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థుల సౌకర్యార్థం మౌలికవసతులు కల్పించాం. విద్యార్థులు గంట ముందు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. విద్యార్థులు బయటి వ్యక్తుల మాటలు, ప్రలోభాలకు లోనుకాకుండా పరీక్షలు రాయాలి.

– రమేష్, ఆర్ఐఓ, చిత్తూరు.

పకడ్బందీ చర్యలు



ఇంటర్ పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా చర్యలు చేపట్టాం. పరీక్ష కేంద్రాల్లో సెల్‌ఫోన్ల వినియోగంపై నిషేధం విధించాం. ఇన్విజిలేటర్లు సైతం ఫోన్లు తీసుకెళ్లొద్దని ఆదేశించాం. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేశాం. విధి నిర్వహణలో ఎవరైనా అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం.

– హరినారాయణన్, కలెక్టర్, చిత్తూరు

క్లుప్తంగా

జనారణ్యంలోకి జింక


జింకకు చికిత్స చేయిస్తున్న అధికారులు

వి.కోట: స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలోకి మంగళవారం ఓ జింక ప్రవేశించింది. కుక్కలు దాడి చేయడంతో స్కూలు ఆవరణలోని నీటి తొట్టిలోకి జింక దూకేసింది. గమనించిన స్థానికులు వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. జింకను పశు వైద్యశాలకు తరలించి చికిత్స చేయించి అడవిలో వదిలిపెట్టినట్లు డీఆర్‌ఓ వేణుగోపాలరెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో ఉద్యోగికి గాయాలు

యాదమరి: మండలంలోని పెరుమాళ్లపెంటలో సోమవారం రాత్రి ఎనర్జీ అసిస్టెంట్ నరేష్ విద్యుదాఘాతానికి గురయ్యాడు. రైతు ఫిర్యాదు మేరకు ఎల్‌సీ తీసుకుని విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా హఠాత్తుగా కరెంట్ సరఫరా కావడంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో చీలాపల్లె సీఎంసీకి తీసుకెళ్లారు. విద్యుత్ శాఖ సిబ్బంది సమన్వయ లోపం వల్లే ప్రమాదం జరిగినట్లు స్థానికులు వెల్లడిస్తున్నారు. దీనిపై డీఈ హరి మాట్లాడుతూ ప్రమాద ఘటనపై విచారణ చేపట్టామని, తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.

బస్సు ఢీకొని ఒకరి మృతి

పూతలపట్టు: మండలకేంద్రం వద్ద సోమవారం రాత్రి బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ హరిప్రసాద్ కథనం మేరకు.. మండలంలోని అమ్మగారిపల్లెకు చెందిన దేవరాజులు నాయుడు (62) ద్విచక్రవాహనంలో పి.కొత్తకోటకు వెళ్లి వస్తుండగా బస్సు ఢీకొంది. క్షతగాత్రుడిని వేలూరు సీఎంసీకి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పరామర్శకు వెళ్లి వస్తూ..


ప్రమాదంలో ధ్వంసమైన కారు


రామసుబ్బమ్మ(ఫైల్)


హరీష్, కీర్తి (ఫైల్)


గాయపడిన వెంకటేశ్వర్‌రెడ్డి

- లారీని ఢీకొన్న కారు
- ఓ మహిళ మృతి.. మరొకరి పరిస్థితి విషమం
- ఇద్దరికి గాయాలు

పూతలపట్టు: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బంధువును పరామర్శించే వెళ్లి వస్తుండగా ఓ కుటుంబం ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందగా, మరో మహిళ పరిస్థితి విషమంగా ఉంది. ఇద్దరు మాత్రం తేలికపాటి గాయాలతో బయటపడ్డారు. మంగళవారం ఉదయం పూతలపట్టు మండలం పాలకూరు వద్ద ఈ ప్రమాదం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ప్రకాశం జిల్లా, పామూరు మండలం, తాత్తయ్యపల్లెకు చెందిన వెంకటేశ్వర్‌రెడ్డి (50), రామసుబ్బమ్మ(43) దంపతులు కర్ణాటకలోని హల్సూర్‌లో స్థిరపడ్డారు. వీరి కుమార్తె కీర్తిరెడ్డి(25), కుమారుడు వంశీ (23) బెంగళూరులో వసతి గృహాన్ని నిర్వహిస్తున్నారు. గత ఏడాదే కుమార్తెను ప్రకాశం జిల్లా సీఎస్ పురం మండలం, జంగావారిపల్లెకు చెందిన హరీష్ అనే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు ఇచ్చి పెళ్లి చేశారు. ఈ క్రమంలో గుంటూరులోని సమీప బంధువు గుండెపోటుతో ఆస్పత్రిలో చేరాడు. ఈ విషయం తెలుసుకున్న వెంకటేశ్వర్‌రెడ్డి తన భార్య, కుమార్తె, అల్లుడితో కలిసి కారులో గుంటూరుకు వెళ్లారు. బంధువును పరామర్శించి తిరిగి వస్తుండగా మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో ముందుకు వెళ్తున్న తమిళనాడుకు చెందిన లారీని వెనుక నుంచి ఢీకొన్నారు. దీంతో కారు బోల్తా పడి నుజ్జునుజ్జుగా మారింది. ప్రమాదంలో రామసుబ్బమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. హరీష్, వెంకటేశ్వర్‌రెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. కీర్తి రెడ్డిని చిత్తూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం వేలూరులోని సీఎంసీకి తీసుకెళ్లారు. కీర్తి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు కుటుంబీకులకు వెల్లడించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ హరిప్రసాద్ తెలిపారు.

డీఎస్పీ విచారణ

రోడ్డు ప్రమాద ఘటనాస్థలాన్ని డీఎస్పీ శ్రీనివాస మూర్తి పరిశీలించారు. ప్రమాదానికి కారణాలపై విచారణ చేపట్టారు.

ఎర్రచందనం పట్టివేత


పట్టుబడిన ఎర్రచందనంతో అటవీ శాఖ అధికారులు

రొంపిచెర్ల: మండలంలోని బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ జొమ్ము చెరువు వద్ద మంగళవారం వేకువ జామున అక్రమంగా తరలిస్తున్న ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు పీలేరు సంచార దళ నిఘా విభాగం రేంజ్ ఆఫీసర్ కిరణ్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు కాపు కాసి కారును అడ్డుకోగా డ్రైవర్ పరారయ్యాడన్నారు. కారులో ఐదు ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు వెల్లడించారు. కారుతో సహా దుంగల విలువ సుమారు రూ. 12లక్షలు ఉంటుందని వివరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. దాడిలో సెక్షన్ ఆఫీసర్ వెంకటరమణ, బీట్ ఆఫీసర్ ప్రతాప్, వాచర్ ప్రభుతేజ , డ్రైవర్ చరణ్ పాల్గొన్నారు.

ఫేస్‌బుక్ ప్రేమికురాలికి కౌన్సెలింగ్

– నచ్చజెప్పి ఇంటికి పంపిన పోలీసులు


యువతిని హతియాకు పంపుతున్న పోలీసులు

చిత్తూరు కార్పొరేషన్: ఫేస్‌బుక్‌లో ఏర్పడిన పరిచయం క్రమేణా స్నేహం, ప్రేమగా మారడంతో ఓ యువతి తన ప్రియుడిని పెళ్లి చేసుకునేందుకు ట్రైన్ ఎక్కింది. ఆమెకు మంగళవారం చిత్తూరు ఆర్‌పీఎఫ్ సిబ్బంది కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు. వివరాలు.. జార్ఖండ్ రాష్ట్రం హతియా ప్రాంతానికి చెందిన ఓ 28 ఏళ్ల యువతికి ఫేస్‌బుక్‌లో బెంగళూరులోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్న 23 ఏళ్ల యువకుడు పరిచయమయ్యాడు. ఏడాదిగా వీరు ప్రేమలో మునిగిపోయారు. యువతికి వివాహ సంబంధాలు చూస్తున్న క్రమంలో తనను వెంటనే పెళ్లి చేసుకోవాలని ప్రియుడిని కోరింది. బెంగళూరుకు వస్తే చేసుకుంటానని చెప్పడంతో 12వ తేదీ రాత్రి యశ్వంత్‌పూర్ రైలు ఎక్కేసింది. ఆ ట్రైన్‌లోనే ప్రయాణిస్తున్న యువతి అన్న మిత్రుడు పునీత్ కుర్రే ఆమెను శ్రీకాళహస్తి వద్ద గమనించాడు. వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా సీఆర్‌పీఎఫ్ పోలీసులకు సమాచారం అందించారు. 13వ తేదీ రాత్రి యువతిని చిత్తూరు ఆర్‌పీఎఫ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వన్‌స్టాప్ సెంటర్‌కు తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇప్పించారు. ఎస్‌ఐ వల్లియమ్మ సిబ్బంది ఆ యువతితో మాట్లాడి నచ్చజెప్పారు. ఆమె కుటుంబసభ్యులతో మాట్లాడి మంగళవారం మధ్యాహ్నం హతియాకు వెళ్లే రైలు ఎక్కించారు. కుటుంబీకులు చూసినవారినే పెళ్లి చేసుకుంటానని యువతి చెప్పినట్లు పోలీసులు వెల్లడించారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరికి గాయాలు

శాంతిపురం: మండలంలోని తులసినాయనపల్లె వద్ద మంగళవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరు ఇంజినీరింగ్ విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. గుండిశెట్టిపల్లెకు చెందిన గోపీచంద్(21), నల్లపరెడ్డియూరుకు చెందిన రూపేష్(21) కుప్పంలో పరీక్ష రాసి బైక్‌పై వస్తూ ఆగి ఉన్న లారీని ఢీకొన్నారు. క్షతగాత్రులను స్థానికుల సాయంతో పోలీసులు కుప్పం పీఈఎస్ ఆస్పత్రికి తరలించారు.

టీడీపీ నేతలపై కేసు నమోదు

రామకుప్పం: మండలంలోని 89 పెద్దూరుకు చెందిన వైఎస్సార్ సీపీ మహిళా సర్పంచ్ మల్లిక, ఆమె భర్త గోవిందప్పపై దాడికి పాల్పడిన టీడీపీ నేతలపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. నిందితులు గజేంద్ర, మనోహర్, చరణ్‌పై హత్యాయత్నం,ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కృష్ణయ్య వివరించారు. అలాగే టీడీపీ నేత గజేంద్ర ఫిర్యాదు మేరకు సర్పంచ్ దంపతులు, వారి కుమారుడిపై కూడా కేసు నమోదు చేశామని తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు


మౌనిశ్రీ (ఫైల్)

చిత్తూరు అర్బన్: నగరంలోని గిరింపేటకు చెందిన మౌనిశ్రీ (24) అనే యువతి అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు. బీటెక్ చదివిన మౌనిశ్రీ తల్లిదండ్రులతో కలిసి మసీదుమిట్టలో నివసిస్తోంది. తండ్రి ఈశ్వరన్ వేలూరు రోడ్డులో ఎలక్ట్రికల్ దుకాణం నడుపుతుంటాడు. సోమవారం సాయంత్రం ఇంటికి వచ్చి చూసేసరికి మౌనిశ్రీ కనిపించలేదు. ఆయనఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ సీఐ మద్దయ్య ఆచారి తెలిపారు. యువతి ఆచూకీ తెలిస్తే 8555810860 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

బైక్‌ను ఢీకొన్న వ్యాన్: ఒకరి మృతి



వెంకటేష్ మృతదేహం, వెంకటేష్ (ఫైల్)

పుత్తూరు రూరల్: మండలంలోని పరమేశ్వర మంగళం వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. సీఐ లక్ష్మీనారాయణ కథనం మేరకు.. నగరి ప్రభుత్వ ఆస్పత్రిలో పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తున్న ప్రభాకర్ (27) విధులు ముగించుకొని ఉత్తరపుకండ్రిగ దళితవాడలోని అత్తగారి ఇంటికి మోటర్ సైకిల్‌పై వస్తుండగా వ్యాన్ ఢీకొంది. దీంతో ప్రభాకర్ అక్కడికక్కడే మరణించాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలికల సైనిక్ స్కూల్‌కు విశ్వం విద్యార్థినులు


డి.దేవాన్షి


డి.వినతి చౌదరి


కె.మాన్వికరెడ్డి


ఎస్.వర్షిణి

తిరుపతి ఎడ్యుకేషన్: బాలికల సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్షా ఫలితాల్లో తిరుపతిలోని విశ్వం విద్యాసంస్థల విద్యార్థినులు నలుగురు ఎంపికైనట్లు ఆ విద్యాసంస్థ అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. ఈ ఫలితాల్లో డీ.దేవాన్షి, డీ.వినతి చౌదరి, కే.మాన్వికరెడ్డి, ఎస్.వర్షిణి కిట్టూరు బాలికల సైనిక్ స్కూల్‌లో ప్రవేశం పొందినట్లు తెలిపారు. తమ విద్యార్థులు ఆల్ ఇండియా సైనిక్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు.

రూ.2లక్షల కర్ణాటక మద్యం పట్టివేత


స్వాధీనం చేసుకున్న కారు, మద్యం ప్యాకెట్టు చూపుతున్న పోలీసుల

పలమనేరు : గంగవరం మండలం తాళ్లపల్లె వద్ద మంగళవారం చేపట్టిన వాహనాల తనిఖీలో రూ.2లక్షల విలువైన కర్ణాటక మద్యం పట్టుబడినట్లు సెబ్ సీఐ ఎల్లయ్య తెలిపారు. అనుమానాస్పదంగా కనిపించిన కారును అడ్డుకోగా డ్రైవర్ పరారైనట్లు వెల్లడించారు. కారులో పరిశీలించగా 4,800 ప్యాకెట్ల మద్యం ఉన్నట్లు వివరించారు. మద్యంతో పాటు కారును సీజ్ చేసినట్లు చెప్పారు. ఈ మేరకు కేసును నమోదు చేసి విచారిస్తున్నారు. తనిఖీల్లో ఎస్‌ఐలు రామదాసు,భాస్కర్, రామమూర్తి, సిబ్బంది కృష్ణమాచారి, సయ్యద్‌బాషా పాల్గొన్నారు.

బోగస్ కలకలం

కొంత మంది అడ్డదారుల్లో ఉద్యోగాలు పొందడానికి బరితెగిస్తున్నారు. వారికి కొందరు సహకరిస్తున్నారు. దీంతో అర్హులైన ఉద్యోగులకు అన్యాయం జరుగుతోంది. ఇటీవల జరిగిన కాంట్రాక్టు స్టాఫ్ నర్సుల నియామకాల్లో పలువురు బోగస్ మార్కుల జాబితాతో మెరిట్ సాధించి ఉద్యోగాలు పొందారు. తాజాగా బోగస్ మార్కుల జాబితాల కుంభకోణం వెలుగుచూడడంతో వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయంలో అలజడి నెలకొంది.

- అడ్డదారుల్లో స్టాఫ్ నర్సుల ఉద్యోగాలు
- ఇప్పటికే ఎనిమిది మందివి నకిలీ సర్టిఫికెట్లుగా నిర్ధారణ


వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం

కడప రూరల్ : కాంట్రాక్టు స్టాఫ్ నర్సుల నియామకానికి సంబంధించి ప్రభుత్వం 2022 నవంబర్‌లో నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ ఉద్యోగాలకు వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం పరిధి (జోన్–4)లో దాదాపు 12 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో రాయలసీమ వ్యాప్తంగా అభ్యర్థులు ఉన్నారు. 2023 జనవరిలో స్టాఫ్ నర్సుల నియామక ప్రక్రియను కడపలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నిర్వహించారు. మొత్తం 291 మందికి మెరిట్ ప్రాతిపదికన ఉద్యోగ అవకాశం కల్పించారు. ఈ ఉద్యోగాలు పొందడానికి ఇంటర్మీడియెట్ తర్వాత నాలుగేళ్లు స్టాఫ్ నర్సు కోర్సు చేయాలి. బీఎస్సీ నర్సింగ్ కోర్సును పూర్తిచేయాలి. డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ పరిధిలో ఈ కోర్సుకు గుర్తింపు ఉంటుంది. కాగా స్టాఫ్ నర్సు నియామకాల్లో మార్కుల జాబితానే కీలకపాత్ర పోషిస్తుంది. ఎవరికైతే అత్యధికంగా మార్కులు ఉంటాయో వారినే ఉద్యోగం వరిస్తుంది. ఈ అంశాన్ని గమనించిన కొంతమంది ఏకంగా మార్కుల బోగస్ జాబితాను సృష్టించి ఉద్యోగాలు పొందారు.

అనుమానించి తీగ లాగడంతో..

ఈ వ్యవహారమంతా దాదాపు చిత్తూరు జిల్లా కేంద్రంగా జరగడం చర్చనీయాంశంగా మారింది. ఆ జిల్లాకు చెందిన రిటైర్డ్ పోలీసు అధికారి కుమార్తెకు స్టాఫ్ నర్సు ఉద్యోగం రాలేదు. తన కుమార్తెకు మార్కులపరంగా మెరిట్‌లో ఉన్నప్పటికీ ఉద్యోగం రాకపోవడంతో అనుమానించారు. దాదాపు 15 మందిపై దృష్టి సారించారు. వారిపై కడపలోని వైద్యఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం రీజినల్ డైరెక్టర్‌తోపాటు డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీకి ఫిర్యాదు చేశారు. అందులో కొన్ని బోగస్ మార్కుల జాబితాలు ఉన్నట్లుగా డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వారు నిర్ధారించారు. దీంతో అనుమానం నిజమైంది. కాగా వారికి ఉద్యోగ నియామక పత్రాలను ఇచ్చేముందు ఒరిజినల్ సర్టిఫికెట్లతో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆ కౌన్సెలింగ్‌లో కూడా ఆ శాఖ అధికారులు నకిలీ మార్కుల జాబితాలను కనిపెట్టలేకపోయారు. తాజాగా ఈ అంశం ఆ శాఖలో కలకలం రేపుతోంది. ఈ 15 మందేనా? లేక ఇంకా ఎవరైనా ఉద్యోగాలు పొందిన బోగస్ అభ్యర్థులు ఉన్నారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

వారు వీరేనా?

కోవిడ్ సమయంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో విరివిగా స్టాఫ్ నర్సుల నియామకాలను చేపట్టారు. ఈ సందర్భంగా కొంత మంది వైద్య ఆరోగ్యశాఖకు చెందిన అధికారులు అభ్యర్థులకు తక్కువ మార్కులు ఉన్నా ఎక్కువ ఉన్నట్లుగా సృష్టించి కాంట్రాక్టు నర్సులుగా ఉద్యోగ నియామకాలు చేపట్టారు. అప్పట్లో ఈ అంశం వైద్య ఆరోగ్యశాఖలో చర్చనీయాంశంగా మారింది. అలా నాడు బోగస్ మార్కుల జాబితాను పొందిన వారిలో కొంతమంది తాజాగా వెలుగు చూసిన స్టాఫ్ నర్సు నియామకాల్లో ఉద్యోగాలు చేస్తున్నట్లు వినికిడి.

చట్టపరమైన చర్యలు

15 మంది అభ్యర్థులు బోగస్ మార్కుల జాబితాలు పొందినట్లుగా తమ దృష్టికి వచ్చింది. ఆ వివరాలను డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీకి, డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్ వారికి పంపాము. 15 మందిలో 8 మంది అభ్యర్థుల సర్టిఫికెట్లు బోగస్‌వని డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వారు స్పష్టం చేశారు. ఆ ఎనిమిది మందిలో ఐదుగురు వైద్య విధాన పరిషత్‌లో, ఇద్దరు డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్ ఆధ్వర్యంలో ఉద్యోగాలు చేస్తున్నారు. ఒక అభ్యర్థికి ఉద్యోగం రాలేదు. మిగతా వారి సర్టిఫికెట్ల వివరాలు అందాల్సి ఉంది. కాగా, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ పరిధిలో పని చేస్తున్న ఇద్దరు ఉద్యోగులకు షోకాజు నోటీసులు జారీచేశాం. అక్రమాలకు పాల్పడే వారు ఎవరైనా సరే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ కోటేశ్వరి, రీజినల్ డైరెక్టర్, వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం, కడప

ఇంటిదొంగల పనేనా?

తాజాగా అలజడి రేపుతున్న బోగస్ మార్కుల జాబితా అంశం ఇంటి దొంగల పనా? లేక బయటి వ్యక్తుల పనా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. లోతుగా విచారణ చేస్తే మరి కొత మంది బోగస్ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందిన వారు బయటపడతారని ఆ శాఖకు చెందిన ఉద్యోగులు భావిస్తున్నారు.